సాక్షి
మెదక్

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023

సద్దుల సందడి

జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల వద్ద పేర్చి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు. వేడుకల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అలాగే, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బతుకమ్మ తయారు చేసి, మహిళలతో కలిసి ఆడారు.



తూప్రాన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రామాయంపేట(మెదక్): బతుకమ్మతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మ పేరుస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

న్యూస్‌రీల్

ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఆర్టీసీ సంగారెడ్డి డిప్యూటీ ఈఈ మనోహర్‌రావు



వెల్దుర్తి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ సంగారెడ్డి డిప్యూటీ ఈఈ మనోహర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు వెల్దుర్తి బస్టాండ్‌ను నర్సాపూర్, మెదక్ డీఎంలతో కలిసి సందర్శించారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మించడంతోపాటు ప్రయాణికులకు మౌలిక వసతులైన మరుగుదొడ్లు, బెంచీలు, విద్యుత్, నీటి వసతి వంటి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున దసరా తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఏకే గంగాధర్‌రావు



గంగాధర్‌రావును పార్టీకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

చిన్నశంకరంపేట(మెదక్): సీఎం కేసీఆర్ సమక్షంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఏకే గంగాధర్‌రావు బీఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో ఆయనతోపాటు కుమారుడు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఏకే రమేశ్‌రావు, కొర్విపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి రాధాకిషన్‌రావు పార్టీలో చేరారు. మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన ఏకే గంగాధర్‌రావు టీడీపీ కీలకనేతగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.


మహా రథయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

మెదక్ కలెక్టరేట్: వర్గీకరణే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల విశ్వరూప మహా రథయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న రథయాత్ర ఈనెల 28న జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ పాల్గొంటారని జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలతోపాటు సామాజిక న్యాయాన్ని, ఎస్సీ వర్గీకరణ సమర్థించే శ్రేయోభిలాషులు నాయకులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు మాసాయిపేట యాదగిరి, మురళీ, అస్తగల్ల బాలరాజ్, చెట్లపల్లి యాదగిరి, మాధవ్, సరిగల పరశురాముడు, మాధవి, సంజీవ్, ప్రభాకర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పాజీపల్లి గుట్టపై పులి



గుట్టపై సంచరిస్తున్న పులి

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని అప్పాజీపల్లి గుట్టపై శనివారం పులి సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. రాళ్ల గుట్టపై పులి కనిపించడంతో స్థానికులు ఫొటో తీశారు. దీంతో సాయంత్రం వేళ ప్రజలు అటునుంచి పొలాలకు వెళ్లడానికి జంకుతున్నారు. మూడు రోజుల క్రితం అల్లాదుర్గం రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో కనిపించిన పులి, ఈరోజు అప్పాజీపల్లి ప్రాంతంలో కనిపించిన పులి ఒకటేనా, లేక మరొకటా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. అటవీ శాఖ అధికారులు మాత్రం తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మిత్రులు.. ప్రత్యర్థులు

మెదక్‌లో రాజకీయ చదరంగం

- మిత్రులు శత్రువులుగా.. శత్రువులు మిత్రులుగా..
- పార్టీ మారడంతో ఎడమొహం పెడమొహం
- కలిసి పనిచేస్తున్న కొందరు నాయకులు



రాజకీయంలో శాశ్వత శత్రువులు ఉండరు.. శాశ్వత మిత్రులు అంటూ ఎవరూ ఉండరు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. మొన్నటి వరకు మిత్రులుగా ఉన్న వారు నేడు శత్రువులవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విమర్శించుకుంటున్నారు. నిన్నటి వరకు ఒకరినొకరు దూషించుకున్నవారు నేడు ఒకే వేదికను పంచుకుంటున్నారు. ఇన్ని రోజులు ఎడమొహం, పెడమొహం పెట్టుకున్నవారు పార్టీ కోసం కలిసి పని చేస్తున్నారు. దీంతో మెదక్ నియోజకవర్గంలో రాజకీయం చదరంగంలా మారింది. – మెదక్

పద్మాదేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కలిసి..



మొన్నటి వరకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి రాజకీయ చదరంగంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. ఒకరికొకరు ఎదురైనా ఎడమొహం, పెడమొహం పెట్టుకొని ఉన్నారు. తిరుపతిరెడ్డికి కాంగ్రెస్ టికెట్ లభించకపోవడంతో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ఆయన బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మొన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించుకున్న వీరిద్దరు నేడు ఒకే వేదికపై కూర్చుంటున్నారు. పార్టీ కోసం కలిసి పని చేస్తున్నారు.

మల్లికార్జున్‌గౌడ్.. జీవన్‌రావు



మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జీవన్‌రావు (న్యాయవాది)లు వీరిద్దరు దశాబ్ద కాలంగా మంచి మిత్రులు ఒకరిని విడిచి ఒకరు ఉండేవారు కాదు. తెలంగాణ మలివిడత ఉద్యమంలో ఒకే మాట, ఒకే విధమైన పోరుతో ముందుకు సాగారు. ఉద్యమ సమయంలో వీరిపై లెక్కకు మించినన్ని కేసులు నమోదయ్యాయి. వీరిద్దరు మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో విబేధించి జీవన్‌రావు, మైనంపల్లి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో ఎన్నికల కోసం ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్‌పై ఇద్దరూ విమర్శనాస్త్రాలు సంధించబోతున్నారు.

ప్రశాంత్‌రెడ్డి వర్సెస్ బాలాగౌడ్ ..



పాపన్నపేట మండల ఎంపీపీ చందన భర్త ప్రశాంత్‌రెడ్డి మొన్నటి వరకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా కొనసాగారు. అదే మండలానికి చెంది ప్రస్తుత ఏడుపాయల దేవస్థానం చైర్మన్ బాలాగౌడ్ బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. వీరిద్దరు ఎప్పటి నుంచో మంచి మిత్రులు. ఈ క్రమంలోనే ఇటీవల ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బాలాగౌడ్ మాత్రం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. కాగా, ప్రస్తుతం జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో ఇరువురు వేర్వురు పార్టీల పరంగా విమర్శకులు కాబోతున్నారు.

రమణ వర్సెస్ శ్రీమన్‌రెడ్డి..



చిన్నశంకరంపేట మండలానికి చెందిన పోతరాజు రమణ, శ్రీమన్‌రెడ్డిలు రాజకీయంగా 40 ఏళ్ల మిత్రులు పోతరాజు రమణ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా, జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. శ్రీమన్‌రెడ్డి భార్య ఎంపీపీగా పనిచేశారు. శ్రీమన్‌రెడ్డి, రమణలు ఆ మండలంలో కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపై నడిపించడంలో వారికి వారే సాటి. ఇటీవల డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. రమణ సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఒకే పార్టీలో కొనసాగిన శ్రీమన్‌రెడ్డి, పోతరాజు రమణలు ఇప్పుడు వేర్వేరు పార్టీలు. రేపటి ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శించుకోకున్నారు.

మామిళ్ల వర్సెస్ పబ్బతి..



మెదక్ పట్టణానికి చెందిన మామిళ్ల ఆంజనేయులు, పాపన్నపేట మండలానికి చెందిన పబ్బతి ప్రభాకర్‌రెడ్డిలు దశాబ్ద కాలంగా కాంగ్రెస్‌లో కొనసాగారు. ఆంజనేయులు గతంలో టీఆర్‌ఎస్ నుంచి జెడ్పీటీసీగా గెలుపొందారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి పీసీసీ సభ్యుడిగా, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేశారు. పబ్బతి ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం ఎల్లాపూర్ (సర్పంచ్)తోపాటు కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం మామిళ్ల ఆంజనేయులు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. రేపటి నుంచి జరిగే ఎన్నికల ప్రచారంతో ఇద్దరూ శత్రువులుగా మారబోతున్నారు. ఇద్దరూ రాజకీయంలో ఆరితేరిన వారే.. వీరి మధ్య మాటల యుద్ధం త్వరలో జరగబోతుంది.

31 కేసుల్లో రూ.1.18 కోట్లు పట్టివేత



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 31 కేసుల్లో రూ.1.18 కోట్లు పట్టుబడినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం తన చాంబర్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఈ డబ్బు పట్టుబడినట్లు పేర్కొన్నారు. సరైన పత్రాలు సమర్పించిన 18 మందికి వారి నగదు రూ.20,50,680 ను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. మరో రెండు కేసుల్లో రూ. 10 లక్షలకు పైబడి పట్టుబడినందున సదరు నగదు (86 లక్షలు)ను ఐటీ డిపార్టుమెంట్‌కు సిఫారసు చేశామన్నారు. మిగతా 11 కేసులకు సంబంధించి ఐదుగురు సరైన ఆధార పత్రాలు సమర్పించలేదని తెలిపారు. మరో ఆరు కేసులకు సంబంధించి నగదు కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదన్నారు. నగదు విడుదల కోసం జిల్లా గ్రీవెన్స్ కమిటీ మెదక్ సభ్యులు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ (92814 84100), జిల్లా ఆడిట్ అధికారి రాకేశ్ (99482 13828), జిల్లా ఖజానా అధికారి చిన్న సాయిలు(77999 34150)ను సంప్రదించాలని తెలిపారు. అలాగే, ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డీజీపీ అంజనీ కుమార్ యాదవ్ శనివారం హైదరాబాద్‌లోని ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు..

సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాము నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దసరా తర్వాతే బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకటన!

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిని దసరా పండుగ తర్వాతనే అధికారికంగా ప్రకటిస్తారని తెలిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్, నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో పార్టీ టికెట్ ఆశిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. టికెట్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ప్రగతిభవన్‌లో తెలుపగా టికెట్ తనకే కావాలని, తాను సీఎంను కలిసి టికెట్ విషయం అడుగుతానని చెప్పిన విషయం తెలిసిందే. అనంతరం సీఎం కేసీఆర్ సైతం టికెట్ సునీతారెడ్డికి ఇవ్వాలని నిర్ణయించామని, తనకు ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇస్తామని చెప్పారని తెలిసింది. ఈ అయోమయానికి దసరా తర్వాతే ఫుల్‌స్టాప్ పడనున్నట్లు తెలుస్తుంది.

ఒప్పంద పత్రాలు చట్టరీత్యా చెల్లవు

జూనియర్ సివిల్ జడ్జి అనిత



కేసును పరిష్కరిస్తున్న జడ్జి అనిత

నర్సాపూర్: పెద్దల సమక్షంలో నోటరీలు, బాండ్ పేపర్లపై, తెల్ల కాగితాలపై రాసుకునే విడాకుల ఒప్పంద పత్రాలు చట్ట రీత్యా చెల్లవని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత అన్నారు. శనివారం స్థానిక కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు కొందరు గ్రామ స్థాయిలో పెద్దల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి ఒప్పందాలకు వచ్చి నోటరీ చేయించుకోవడం, బాండ్ పేపర్లపై, తెల్ల కాగితాలపై రాసుకుంటే చట్టరీత్యా చెల్లవని సూచించారు. దంపతులు విడాకులు తీసుకోవాలంటే కోర్టు ప్రకారం చట్టరీత్యా విడాకులు పొందాలని సూచించారు. కోర్టు ద్వారా విడాకులు పొందితే భవిష్యత్తులో చట్టబద్ధంగా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉంటుందని జడ్జి హితవు పలికారు. అలాగే పలు కేసులు పరిష్కరించి బాధితులకు నేరానికి పాల్పడిన వ్యక్తులు నష్టపరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, రాజునాయక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు అండగా..

- కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



పోలీసు అమరులకు నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ: అమరులైన పోలీస్ కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ రాజర్షి పేర్కొన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను ఎస్పీ రోహిణీప్రియదర్శిని ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజర్షిషా పాల్గొని పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ రోహిణీప్రియదర్శిని, అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి మాట్లాడుతూ.. పోలీసులు ప్రాణాలకు తెగించి ఎన్నో త్యాగాలు చేస్తూ వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ఎస్పీ రోహిణీప్రియదర్శిని మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులను స్మరిస్తూ ప్రతీ ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాలకు మానసిక బలాన్ని అందించడమే పోలీసు అమరవీరులకు అందించే నిజమైన నివాళి అన్నారు. వారి త్యాగాలను సమాజం గుర్తుంచుకొనే విధంగా ఈ నెల 31 వరకు ప్రముఖ దిన పత్రికల్లో ప్రకటనలు, బ్యానర్లు, కమిషనరేట్, పోలీసు స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం, వ్యాసరచన పోటీలు, రక్త దాన శిబిరాలు, కొవ్వొత్తి ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, జిల్లా ఆర్‌ఐలు నాగేశ్వర్ రావు, అచ్యుతరావు, జిల్లా సీఐలు ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మహిళలకు టికెట్లు దక్కేనా?

- మెదక్‌లో పద్మారెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్
- బీజేపీ పటాన్‌చెరు టికెట్ ఆశిస్తున్న గోదావరి అంజిరెడ్డి
- కాంగ్రెస్ దుబ్బాక, సిద్దిపేట టికెట్ల ఆశావహుల్లో కత్తి కార్తీక, భవానీరెడ్డి
- రెండో జాబితాపై హస్తం కసరత్తు



పద్మాదేవేందర్‌రెడ్డి



సునీతాలక్ష్మారెడ్డి



గోదావరి అంజిరెడ్డి



కత్తి కార్తీక



భవానీరెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మహిళలకు టికెట్ల కేటాయింపు అంశం ఇప్పుడు తెరపైకి వస్తోంది. పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు మహిళలకు కనీస ప్రాతినిధ్యమైనా కల్పించాలని డిమాండ్ వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇప్పటికే పది చోట్ల అభ్యర్థులను ప్రకటించిన అధికార బీఆర్‌ఎస్‌మెదక్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డికి అవకాశం కల్పించింది. నర్సాపూర్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఒకట్రెండు చోట్ల బీజేపీ టికెట్ల రేసులో మహిళలు ఉన్నారు. ప్రధానంగా పటాన్‌చెరులో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చిన పార్టీ కావడంతో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో టికెట్ తనకు వస్తుందనే ధీమాతో ఉన్నారు.

కాంగ్రెస్ రెండో జాబితాలోనైనా..

కాంగ్రెస్ కూడా ఉమ్మడి జిల్లాలో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ ఐదింటిలో మహిళలు లేరు. మిగిలిన ఈ ఆరు నియోజకవర్గాల్లో ఎంత మంది మహిళలకు టికెట్ కేటాయిస్తుందనేది రెండో జాబితా ప్రకటించాకే స్పష్టత రానుంది. పార్టీ టికెట్ కోసం పలు చోట్ల మహిళా నేతలు రేసులో ఉన్నారు. దుబ్బాక, సిద్దిపేట రేసులో కత్తి కార్తీక, భవానీరెడ్డి వంటి మహిళా నేతలున్నారు. రెండో జాబితాలో ఎంత మందికి అవకాశం కల్పిస్తుందనేది వేచి చూడాల్సిందే.

మహిళా ఓటర్లే అధికం

ఉమ్మడి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 27.15 లక్షల మంది ఉండగా, ఇందులో పురుషులు 13.50 లక్షలు, మహిళలు 13.65 లక్షల మంది ఉన్నారు. ప్రధానంగా సంగారెడ్డి, అందోల్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు కనీస ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది

దుర్గాభవానీ అలంకరణలో..



పాపన్నపేట(మెదక్): దేవీ శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారు శనివారం దుర్గాభవానీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామి అమ్మవారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ సిబ్బంది స్వామికి మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. సనాతన శర్మ వేద మంత్రాలతో వనదుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శ్రీమహాగౌరి దేవిగా..



వర్గల్(గజ్వేల్): దేవీశరన్నవరాత్రోత్సవాలతో వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం అలరారుతోంది. ఉత్సవాల్లో ఏడోరోజు శనివారం సరస్వతీ దేవి సకల శుభకరి శ్రీమహాగౌరిదేవి అలంకారంలో దివ్యదర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో తెల్లవారుజామున విశేష పంచామృత మహాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, పూలమాలికలు, సర్వాభరణాలతో శ్రీమహాగౌరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విలక్షణ తీర్పుల పోరుగడ్డ





- హుస్నాబాద్‌లో రాజకీయం రసవత్తరం
- ఎన్నికల్లో వైవిధ్య తీర్పు ఇవ్వడంలో ప్రత్యేకత
- కాంగ్రెస్, సీపీఐలకు బహు ఆదరణ
- నియోజకవర్గంలో ఒక్కసారి కూడా గెలవని టీడీపీ

హుస్నాబాద్‌: ఉద్యమాలకు పెట్టింది పేరు.. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులను ఎదిరించి రణభేరి మోగించిన హుస్నాబాద్‌ రాజకీయంగా చైతన్యవంతమైన ప్రాంతం. ఎర్రజెండా నీడలో ఒదిగినా.. తెలుగుదేశం ప్రభంజనంలో తన ప్రత్యేకతను చాటుకున్నా.. కాంగ్రెస్‌ను ఆదరించినా.. తెలంగాణ ఉద్యమంలో శిఖరాగ్రానికి చేరుకుని బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచినా.. హుస్నాబాద్‌ ప్రజలది విలక్షణమైన తీర్పు. హుస్నాబాద్‌ 1952లో నుస్తులాపూర్‌ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేది. 1957లో ఇందుర్తి నియోజకవర్గంలో చేరింది. ఈ నియోజకవర్గంలో హుస్నాబాద్, చిగురుమామిడి, కొహెడ, బెజ్జంకి మండలాలు ఉండేవి. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో నాలుగు మండలాలుగా ఉన్న ఇందుర్తి నియోజకవర్గం ఆరు మండలాలతో హుస్నాబాద్‌ నియోజకవర్గంగా ఏర్పడింది. ఇందుర్తి నియోజకవర్గంలో ఉన్న బెజ్జంకి మండలాన్ని మానకొండూరు నియోజకవర్గంలో చేర్చగా, హుజూరాబాద్‌ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, సైదాపూర్‌ మండలాలు హుస్నాబాద్‌ నియోజకవర్గంలోకి వచ్చి చేరాయి. కొహెడ, చిగురుమామిడి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హుస్నాబాద్, సైదాపూర్‌ మండలాలతో కలిపి హుస్నాబాద్‌ నియోజకవర్గంగా అవతరించింది. తదనంతరం అక్కన్నపేట కొత్త మండలంగా ఏర్పడి ప్రస్తుతం ఏడు మండలాలతో అతి పెద్ద నియోజకవర్గంగా మారింది.

మొదటి నుంచి విభిన్నం

నుస్తులాపూర్‌ నుంచి హుస్నాబాద్‌ నియోజకవర్గం వరకు ఈ నియోజకవర్గానిది విలక్షణ పంథా. నాడు కమ్యూనిస్టులకు పెట్టని కోటగా నిలిచినప్పటికీ బొప్పరాజు లక్ష్మీకాంతారావు కాంగ్రెస్‌ పార్టీ పక్షాన మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983 తెలుగుదేశం ప్రభంజనంలోనూ లక్ష్మీకాంతారావు విజయం సాధించారు. హుస్నాబాద్‌ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థులు ఒక్కసారి కూడా గెలుపొందలేదు. ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీడీఎఫ్‌ (పీపుల్స్‌ డెమోక్రటిక్‌ ఫ్రంట్‌) రెండు సార్లు, సీపీఐ ఆరు సార్లు, కాంగ్రెస్‌ ఐదు సార్లు, బీఆర్‌ఎస్‌ రెండు సార్లు విజయం సాధించాయి.



ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో దివంగత వైఎస్‌ఆర్‌(ఫైల్‌)

అక్కడ అధికారం.. ఇక్కడ ప్రతిపక్షం

నుస్తులాపూర్‌ నియోజకవర్గం నుంచి ఇప్పటి హుస్నాబాద్‌ నియోజకవర్గం వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. నాలుగు సార్లు మినహా ప్రతీసారి ప్రభుత్వేతర ఎమ్మెల్యేలను గెలిపించడం ఇక్కడి ప్రజల ప్రత్యేకత.

భౌగోళికంగా పెద్ద నియోజకవర్గం

కరీంనగర్, వరంగల్, సిద్దిపేట జిల్లాల్లో ఉన్న హుస్నాబాద్‌ నియోజకవర్గం చారిత్రక నేపథ్యంతో పాటు భౌగోళికంగా చాలా పెద్దది. ఇందులో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు ఉన్నాయి. ఇక్కడ 2011 జనాభా లెక్కల ప్రకారం 3,05,333 జనాభా ఉంది.

నియోజకవర్గ ఓటర్లు..	
మొత్తం ఓటర్లు	2,36,570
పురుషులు	117163
స్త్రీలు	119403
ఇతరులు	04
మున్సిపాలిటీలు	01
మండలాలు	07
పోలింగ్‌ కేంద్రాలు	304
గ్రామాలు	160

ఎమ్మెల్యేలు, పార్టీల వివరాలు

సంవత్సరం	నియోజకవర్గం	ఎమ్మెల్యే	పార్టీ
1952	నుస్తులాపూర్‌	సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి	పీడీఎఫ్‌
1957	ఇందుర్తి	చామనపల్లి చొక్కారావు	పీడీఎఫ్‌
1962	ఇందుర్తి	బి.లక్ష్మీకాంతారావు	కాంగ్రెస్‌
1967	ఇందుర్తి	బి.లక్ష్మీకాంతారావు	కాంగ్రెస్‌
1972	ఇందుర్తి	బద్దం ఎల్లారెడ్డి	సీపీఐ
1978	ఇందుర్తి	దేశిని చినమల్లయ్య	సీపీఐ
1983	ఇందుర్తి	బి.లక్ష్మీకాంతారావు	కాంగ్రెస్‌
1985	ఇందుర్తి	దేశిని చినమల్లయ్య	సీపీఐ
1989	ఇందుర్తి	దేశిని చినమల్లయ్య	సీపీఐ
1994	ఇందుర్తి	దేశిని చినమల్లయ్య	సీపీఐ
1999	ఇందుర్తి	బొమ్మ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్‌
2004	ఇందుర్తి	చాడ వెంకట్‌రెడ్డి	సీపీఐ
2009	హుస్నాబాద్‌	అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి	కాంగ్రెస్‌
2014	హుస్నాబాద్‌	ఒడితెల సతీష్‌కుమార్‌	బీఆర్‌ఎస్‌
2018	హుస్నాబాద్‌	ఒడితెల సతీష్‌కుమార్‌	బీఆర్‌ఎస్‌

మూడు ప్రాజెక్టులకు ఇక్కడే శ్రీకారం

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించిన అప్పటి సీఎం దివంగత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి గౌరవెల్లి, గండిపెల్లి, తోటపల్లి ప్రాజెక్టుల నిర్మాణానికి ఏకకాలంలో శ్రీకారం చుట్టారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత తోటపల్లి ప్రాజెక్టును రద్దు చేసి, గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచింది. ప్రస్తుతం గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాగా, గండిపెల్లి ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్‌దే గెలుపు

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌



ప్రచారం చేస్తున్న పొన్నం

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): హుస్నాబాద్‌లో కాంగ్రెస్‌ అభ్యర్థి ఎవరైనా తమదే గెలుపు అని కరీంనగర్‌ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ అన్నారు. శనివారం మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ అబద్దపు హామీలు గుప్పిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి మాఫియా రాజ్యమేలుతూ లూటీ చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే కర్ణాటక, హిమాచల్‌లో ఎన్నికల హామీలను కాంగ్రెస్‌ తూచతప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మంద ధర్మయ్య, బాలకిషన్, రఫీ ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ అన్నారు. మండల పరిధి అంతక్కపేట, అక్కన్నపేట, గొల్లకుంట, కేశనాయక్‌తండా, పంతుల్‌తండాల్లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలు, కోలాటం, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ అమలు చేసినన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, ఆయనంటే ప్రజలకు నమ్మకమని అన్నారు. మరోసారి తనను ఆశీర్వదిస్తే అక్కన్నపేట మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. చిన్నగుబ్బడికి తారురోడ్డు నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రాయిరెడ్డి రాజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, సర్పంచ్‌ లావణ్య, రజిత, సాంబరాజు, మాలోతు భీలునాయక్‌ పాల్గొన్నారు.

బీజేపీతో బీఆర్‌ఎస్‌ చీకటి ఒప్పందం

జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి చంద్రశేఖర్‌



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌

ఝరాసంగం(జహీరాబాద్‌): రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకునేందుకు బీజేపీతో బీఆర్‌ఎస్‌ చీకటి ఒప్పందం చేసుకుందని, అందుకే కేసీఆర్‌ అవినీతిపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జహీరాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి చంద్రశేఖర్‌ ఆరోపించారు. వస్తున్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వనంపల్లి, భోజ్యా నాయక్‌ తండా, కక్కర్‌ వాడ, బిడెకన్నే గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్‌ కుటుంబం అవినీతి రాష్ట్ర హద్దులు దాటి దేశ రాజధానికి చేరిందన్నారు. బీఆర్‌ఎస్‌ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలే అమలు చేయలేదని, కొత్తగా ఏం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాచ్నూర్‌ సర్పంచ్‌ రాజు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్‌ నాయకులు మోహన్‌రెడ్డి, వాహెద్‌ అలీ కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. సమావేశంలో ఉజ్వల్‌ రెడ్డి, హన్మంత్‌ రావు పాటిల్, దేవదాసు, మల్లన్న పాటిల్, శంకర్‌ పాటిల్, శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు.

వన్‌టైం వండర్‌!

- నర్సింహారెడ్డి, బాగన్నలు ఎమ్మెల్యేగా ఒకే చాన్స్‌
- గీతారెడ్డికి మాత్రమే రెండో అవకాశం
- అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్‌ ఓటర్ల వైవిధ్య తీర్పు



పి.నర్సింహారెడ్డి



సి.బాగన్న

జహీరాబాద్‌: వైవిధ్యభరితమైన తీర్పులు ఇవ్వడంలో జహీరాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు ముందుంటారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యే పోటీ చేసే అభ్యర్థులకు ఒక్కసారి మాత్రమే గెలిచే అవకాశం ఇచ్చారు. ఒక్క గీతారెడ్డికి మాత్రమే రెండు సార్లు విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసిన పి.నర్సింహారెడ్డి 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్‌.దశరథరెడ్డిపై గెలుపొందారు. 1994 ఎన్నికల్లోనూ పోటీచేసిన పి.నర్సింహారెడ్డి టీడీపీ అభ్యర్థి సి.బాగన్న చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన ఎమ్మెల్యేగా ఒకే అవకాశంతో సరిపెట్టుకోక తప్పలేదు. 1999 ఎన్నికల్లో సిట్టింగ్‌ ఎమ్మెల్యే బాగన్నకు టీడీపీ నుంచి టికెట్‌ దక్కలేదు. ఆయన స్థానంలో జి.గుండప్పకు ఇచ్చారు. 2004 ఎన్నికల్లో బాగన్నకు టీడీపీ టికెట్‌ దక్కినా ఓటమి పాలయ్యారు. దీంతో ఒక సారి గెలుపుతోనే బాగన్న సరిపెట్టుకున్నారు. తాజాగా సిట్టింగ్‌ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బీఆర్‌ఎస్‌ నుంచి బరిలో దిగి కాంగ్రెస్‌ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌తో పోటీని ఎదుర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో మాణిక్‌రావు గెలుపొందితే రెండో పర్యాయం విజయాన్ని నమోదు చేసుకున్నవారి జాబితాలో చేరుతారు. నర్సింహారెడ్డి, బాగన్నల రికార్డును అధిగమిస్తారా లేదా అనేది ఓటర్లు తేల్చనున్నారు.

గీతారెడ్డికి తీరని హ్యాట్రిక్‌ ముచ్చట

2009 ఎన్నికల్లో జహీరాబాద్‌ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. దీంతో స్థానికంగా కాంగ్రెస్‌లో బలమైన నేత లేక పోవడంతో అప్పటి సీఎం దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి మాజీ మంత్రి జె.గీతారెడ్డికి జహీరాబాద్‌ నుంచి అవకాశం కల్పించారు. అంతకు ముందు గజ్వేల్‌ నుంచి ప్రాతినిథ్యం వహించిన ఆమెకు అక్కడి స్థానం జనరల్‌ కేటగిరిలోకి వెళ్లినందున జహీరాబాద్‌కు మార్చారు. ఆ ఎన్నికల్లో గీతారెడ్డి టీడీపీ అభ్యర్థి వై.నరోత్తంపై స్వల్ప ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి జె.గీతారెడ్డి తిరిగి పోటీచేసి టీఆర్‌ఎస్‌ అభ్యర్థి కె.మాణిక్‌రావుపై విజయం సాధించారు. రెండు పర్యాయాలు వరుస విజయాలు సాధించిన ఆమె మూడో పర్యాయం గెలుపొంది హ్యాట్రిక్‌ కొట్టాలని భావించి 2018 ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక్కడి ఓటర్లు ఆ అవకాశం ఇవ్వలేదు. ఆ ఎన్నికల్లో మాణిక్‌రావును విజయం వరించింది.



మొదటి సారి ఓడినా.. తిరిగి నెగ్గారు

మొదటిసారి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలైన పి.నర్సింహారెడ్డి, కె.మాణిక్‌రావు రెండోసారి బరిలో నిలిచి విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో పి.నర్సింహారెడ్డి జనతా పార్టీ తరపున కాంగ్రెస్‌ అభ్యర్థి బాగారెడ్డిపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1989 ఎన్నికల్లో మాత్రం ఆయన కాంగ్రెస్‌ టికెట్‌ను సాధించి టీడీపీ అభ్యర్థి ఆర్‌.దశరథరెడ్డిపై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి జె.గీతారెడ్డి చేతిలో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి కె.మాణిక్‌రావు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో మాణిక్‌రావు తిరిగి టికెట్‌ను సాధించి కాంగ్రెస్‌పై విజయం సాధించారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేదు

బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



ప్రసంగిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్‌: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఎదురు లేదని దుబ్బాక బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్‌ పరిధిలోని రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయంలో ఆయన పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మరని.. కేసీఆర్‌నే మళ్లీ దీవిస్తారన్నారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని ఎమ్మెల్యే రఘునందన్‌రావును ప్రజలు నిలదీయాలని కోరారు. తనపై నమ్మకంతో రెండు సార్లు ఎంపీగా గెలిపించారని, ఈ సారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తుదిశ్వాస ఉన్నంతవరకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, కౌన్సిలర్‌ నిమ్మ రజిత గిరి, ఆలయం చైర్మన్‌ రొట్టె రమేశ్‌ ఉన్నారు.

మండల పరిషత్‌లో మంట

- పార్టీలు మారుతున్న ఎంపీటీసీలు
- సమావేశానికి హాజరు కాని సభ్యులు



చిన్నశంకరంపేట(మెదక్‌): శాసన సభ ఎన్నికల రాజకీయం మండలంలో రసవత్తరంగా మారింది. వాటి ప్రభావం చిన్నశంకరంపేట మండల పరిషత్‌ పై పడింది. మెదక్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ నుంచి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నుంచి మైనంపల్లి రోహిత్‌రావు బరిలో నిలిచారు. వీరు చిన్నశంకరంపేట మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడి ఎంపీటీసీలను వారి పార్టీల్లో చేర్చుకుని ఎన్నికల్లో విజయం సాధించాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇప్పటికే చిన్నశంకరంపేట వైస్‌ ఎంపీపీ సత్యనారాయణగౌడ్‌ గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకు ముందే మిర్జాపల్లి ఎంపీటీసీ సక్కుభాయి, ధరిపల్లి ఎంపీటీసీ రాణెమ్మ, అంబాజిపేట ఎంపీటీసీ జయమ్మ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా బీఆర్‌ఎస్‌ గవ్వలపల్లి ఎంపీటీసీ రాతుల సునీత గురువారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీటీసీ సభ్యులు ఇలా పార్టీలు మారుతుండటం మండల పరిషత్‌పై ప్రభావం పడింది. శుక్రవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. కాగా చిన్నశంకరంపేట మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా గత స్థానిక ఎన్నికల్లో ఏడుగురు సభ్యులు కాంగ్రెస్‌ నుంచి గెలుపొందారు. ఐదుగురు బీఆర్‌ఎస్, మరొకరు బీఆర్‌ఎస్‌ రెబల్‌ అభ్యర్థి గెలిచారు. కాంగ్రెస్‌ అభ్యర్థి ఆవుల భాగ్యలక్ష్మి ఎంపీపీగా, సత్యనారాయణగౌడ్‌ వైస్‌ ఎంపీపీగా ఎన్నికయ్యారు. తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా కాంగ్రెస్‌లో ఎంపీపీ, ఇద్దరు ఎంపీటీసీలుండగా బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీ చేరికతో వీరి సంఖ్య నాలుగుకు చేరింది. ఇక బీఆర్‌ఎస్‌లో ఎంపీటీసీల సంఖ్య తొమ్మిదికి చేరింది. దీంతో మండల పరిషత్‌ రాజకీయాలు చర్చనీయంశంగా మారాయి.

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజకీయమా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): రాజ్యాంగ బద్ధమైన హోదాలో కొనసాగుతూ బీఆర్‌ఎస్‌ పార్టీకి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ బక్కి వెంకటయ్య ప్రచారం చేస్తున్నాడని ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంతో పాటు బేగంపేటలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వెంకటయ్య ఆయన స్వగ్రామం భూంపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ఓటర్లకు కారు గుర్తుకు ఓటు వేయాలని ఫోన్‌ ద్వారా ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. అందుకు సంబంధించిన కాల్‌ రికార్డింగులు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. అంతగా ప్రేమ ఉంటే దళిత కుటుంబాలందరికీ రూ.10 లక్షలు అందిస్తే స్వాగతిస్తానన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, మల్లన్నగారి భిక్షపతి, ఎల్ముల దేవరాజు, అరిగె కృష్ణ, చింత సంతోష్, భాను, నవీన్, సాయిలు, నర్సింహులు పాల్గొన్నారు.

లక్ష రూపాయల నగదు సీజ్‌



నగదు సీజ్‌ చేస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును ఫ్లయింగ్‌స్క్వాడ్‌ టీం పట్టుకుని సీజ్‌ చేశారు. శనివారం కౌడిపల్లి బట్టమ్మదేవి ఆలయం సమీపంలోని హైవేపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా పాపన్నపేట మండలం నార్సింగ్‌కు చెందిన మహేష్‌గౌడ్‌తోపాటు మరో ముగ్గురు కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. కారును ఆపి అధికారులు తనిఖీ చేయగా వారి వద్ద లక్ష రూపాయలు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్‌ చేశారు.

ట్రాక్టర్, బైక్‌ ఢీకొని ఒకరు మృతి



కృష్ణగౌడ్‌ (ఫైల్‌)

అల్లాదుర్గం(మెదక్‌): ట్రాక్టర్, బైక్‌ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధి బహిరన్‌దిబ్బ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం గ్రామానికి చెందిన మద్దూరి కృష్ణగౌడ్‌(30), నక్క పెంటయ్యలు బైక్‌పై బహిరన్‌దిబ్బకు వెళ్తుండగా గ్రామ శివారులో ఎదురుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణగౌడ్‌ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెంటయ్యకు తీవ్ర గాయాలు కావడంతో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పవర్‌ సెంటర్‌గా పాపన్నపేట

- 16సార్లు ఎన్నికలు.. 9మంది ఎమ్మెల్యేలు ఇక్కడి నుంచే
- మెతుకు సీమ రాజకీయాలను శాసిస్తున్న మండలం




పాపన్నపేట(మెదక్‌): సంస్థానాధీశుల కోట.. పాపన్నపేట.రాజకీయ రణతంత్రాలకు.. పరిపాలనా దక్షతకు పెట్టింది పేరు. అనాది నుంచి మెతుకు సీమ రాజకీయాలను శాసిస్తుంది. ఇప్పటి వరకు మెదక్‌ అసెంబ్లీ నియోజక వర్గానికి పదహారు సార్లు ఎన్నికలు జరిగితే తొమ్మిది సార్లు పాపన్నపేట మండల నాయకులే ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం గమనార్హం. ఈ మండలం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన దివంగత కరణం రామచంద్రారావు పంచాయతీరాజ్‌ శాఖ మంత్రిగా పనిచేసి అప్పటి సీఎం ఎన్టీ రామారావు ఆలోచన మేరకు, మాండలిక వ్యవస్థకు రూపు తీసుకొచ్చారు. కానీ రానురాను పాపన్నపేట మండల వాసుల రాజకీయ ప్రస్థానం మసక బారుతుంది. కానీ ఇప్పటికీ మెదక్‌ నియోజక వర్గంలోని 7 మండలాల్లో ఈ మండలమే పెద్దది. నియోజకవర్గంలో 2,06,199 ఓట్లు ఉండగా, మండలంలో 39,679 ఓట్లు ఉన్నాయి.

ఎక్కువ మంది మండలవాసులే..

మెదక్‌ అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటిసారి 1952లో ఎన్నికలు జరుగగా మెదక్‌ పట్టణానికి చెందిన ఆర్‌.వెంకటేశ్వర్లు (కాంగ్రెస్‌) ఎన్నికయ్యారు. 1957లోనూ ఆయనే విజయం సాధించారు. 1962లో ఆనందాదేవి(సీపీఐ) గెలుపొందారు. 1967లో పాపన్నపేట సంస్థానాధీశుడు రాజా రామచంద్రారెడ్డి(కాంగ్రెస్‌)ఎన్నికయ్యారు. 1972లో కొత్తపల్లి గ్రామానికి చెందిన కరణం రామ చంద్రారావు రాజకీయ అరంగ్రేటం చేసి(ఇండిపెండెంట్‌)గా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అనంతరం టీడీపీలో చేరి 1983లో మెదక్‌ ఎమ్మెల్యేగా ఎన్నికై , పంచాయతీరాజ్‌ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉమ్మడి మెదక్‌ జిల్లా రాజకీయాల్లో ఎదురులేని నాయకుడిగా అపర చాణక్యుడిగా పేరుగాంచారు. 1985లోనూ ఆయనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989లో పాపన్నపేట మండలం యూసుఫ్‌పేటకు చెందిన నారాయణ రెడ్డి(కాంగ్రెస్‌)ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994, 1999లో తిరిగి కరణం రామచంద్రారావు వరుస విజయాలు సాధించారు. 2001లో ఆయన అనారోగ్యంతో మృతిచెందగా, 2002లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సతీమణి కరణం ఉమాదేవి(టీడీపీ) నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2004లో యూసుఫ్‌పేటకు చెందిన శశిధర్‌రెడ్డికి కాంగ్రెస్‌ టికెట్‌ లభించక పోవడంతో జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆయనతో పాపన్నపేట రాజకీయ ప్రస్థానానికి బ్రేకులు పడ్డాయి. అనంతరం 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి శశిధర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు పై పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2014 ఎన్నికల్లో మండలవాసులకు టికెట్‌ దక్కలేదు. బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి పోటీ చేసిన పద్మాదేవేందర్‌ రెడ్డి, కాంగ్రెస్‌ అభ్యర్థి విజయశాంతిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ నుంచి యూసుఫ్‌పేటకు చెందిన ఉపేందర్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పద్మాదేవేందర్‌ రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. ఈ సారి జరుగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ ఆశించి శశిధర్‌రెడ్డి భంగపడ్డారు. ఇక బీజేపీ నుంచి పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కరణం పరిణీత టికెట్‌ ఆశిస్తున్నారు. కాని ఎంత వరకు సఫలీకృతులవుతారో వేచి చూడాల్సిందే.

పాపన్నపేట సంస్థానాధీశుల కోట



క్లుప్తంగా

రూ.1.85 లక్షలు పట్టివేత



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంపేట(మెదక్): నిజాంపేటలో వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు రూ.1.85 లక్షలు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి శనివారం వివరాలు తెలిపారు. స్థానిక చెక్‌పోస్ట్ వద్ద నిజాంపేట నుంచి వస్తున్న ఒక వాహనం నుంచి రూ.65,700; మరో వాహనం నుంచి రూ.1,19,900 పట్టుకున్నట్టు ఆయన చెప్పారు. ఎవరైనా రూ.50 కంటే ఎక్కువ డబ్బు తీసుకెళ్లాలంటే తప్పనిసరిగా సరైన పత్రాలు తీసుకుని వెళ్ళాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

178 మంది నుంచి రూ.7,97,87,782 నగదు సీజ్

77 కేసులకు అప్పీల్ చేసుకోగా

34 కేసులకు పరిష్కారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీల్లో 178 మంది నుంచి రూ. 7,97,87,782 సీజ్ చేసినట్లు రంగారెడ్డి కలెక్టర్ భారతి హోళీకేరి ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో 77 కేసులకు అప్పీల్ చేసుకోగా, 34 కేసులు పరిష్కరించి రూ.1,25,66,074ల నగదును విడుదల చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలకు పైగా ఉన్న కేసును ఇన్‌కమ్ టాక్స్ విభాగానికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్‌గా జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్‌ను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న/ రవాణా చేస్తున్న నగదు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

చెక్ పోస్టులపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పీఎస్‌ల పరిధిలో చేపడుతున్న చర్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ప్రజలకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకునేలా చూడాలన్నారు. చెక్ పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయి సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏ ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు కరుణాసాగర్ రెడ్డి, నర్సింలు, శేఖర్ గౌడ్, విజయ్‌కుమార్, జాన య్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

మాల మహానాడు అధ్యక్షుడు వెంకటయ్య

పరిగి: హక్కుల సాధనకు ఆదివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు శారదా గార్డెన్‌లో నిర్వహించే సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాసాని వీరేశ్, మారుతికిరణ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

బీఎల్‌ఓ, సూపర్ వైజర్లపై వేటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవెల్ అధికారి, సూపర్‌వైజర్లపై జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోళీకేరి సస్పెన్షన్ వేటు వేశారు. శేరిలింగంపల్లి శాసనసభ నియోజకవర్గం 335 పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. ఈసీ ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ జరిపించగా, పొరపాట్లు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీఎల్‌ఓ సుజాత, సూపర్‌వైజర్ గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంగారెడ్డిలో డివిజనల్ కార్యాలయాలు

- ఏర్పాటు చేయాలని మండలవాసుల విజ్ఞప్తి
- పునర్విభజనతో ఆ జిల్లాలో విలీనం
- నియోజకవర్గం మాత్రం నర్సాపూర్
- దూరాభారంతో ప్రజలకు తప్పని తిప్పలు

హత్నూర (సంగారెడ్డి): జిల్లాల విభజనతో హత్నూర మండల ప్రజలు ఆగమయ్యారు. డివిజనల్ కార్యాలయాలు నాలుగు పట్టణాల్లో ఉండగా నరకయాతన పడుతున్నారు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో కొన్నేళ్లుగా పరేషాన్ అవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ సమస్యలపై నిలదీసే అవకాశం ఉంది. మండలంలో 55,935 మంది జనాభా ఉంది. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో 37,485 మంది ఓటర్లు ఉండగా పురుషులు18,649, మహిళలు 28,835 మంది ఉన్నారు. ప్రస్తుతం కొత్త ఓటర్ల నమోదుతో ఆ సంఖ్య 40,780 మందికి చేరింది. 45 గ్రామాలుండగా 38 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ మండలం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతోంది. కానీ పునర్విభజన వల్ల మండలం సంగారెడ్డి జిల్లాలో కలిసిపోయింది. జిల్లా ఒకటి, నియోజకవర్గం మరోకటి కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలానికి చెందిన రెవెన్యూ డివిజన్ సంగారెడ్డి పరిధిలో వస్తోంది. పోలీస్ డివిజనల్ కార్యాలయం, పంచాయతీ రాజ్ డివిజనల్ కార్యాలయాలు పటాన్‌చెరులో ఉన్నాయి. పోలీస్ సర్కిల్ జిన్నారంలో ఉంది. ప్రొఫెషనల్ అండ్ ఎక్సైజ్ సర్కిల్, ప్లాట్ల రిజిస్ట్రేషన్, ఆర్ అండ్ బీ డివిజనల్ కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వ్యవసాయ శాఖ డివిజనల్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాలు అందోల్ నియోజకవర్గం జోగిపేటలో ఉన్నాయి. మండల ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా డివిజన్ కార్యాలయానికి వెళ్లాలంటే నాలుగు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో మెదక్ జిల్లాలో ఉన్నప్పుడు అన్ని కార్యాలయాలు నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో ఉండేవి. ప్రస్తుతం మండల ప్రజలు నాలుగు పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులకు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అన్ని కార్యాలయాలు ఒకే పట్టణంలో ఉండేలా చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే ఓటు వేస్తామని పలు గ్రామాల గ్రామస్తులు తేల్చి చెబుతున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఓట్ల కోసం గ్రామాలకు వస్తే నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. పాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన చేసినప్పటికీ తమ మండలానికి మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.



హత్నూర తహసీల్దార్ కార్యాలయం

అధికారులు పరిశీలించాలి

డివిజన్ కార్యాలయాలు నలుదిక్కుల్లో ఉండగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. జోగిపేట్ వెళ్లాలంటే అవస్థ పడుతున్నాం. డివిజన్ కార్యాలయాలన్నీ సంగారెడ్డిలో ఉంటే బాగుండేది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు పరిశీలించాల్సి ఉంది.

– బాలరాజు గౌడ్, తహర్ఖాన్ పేట్

సంగారెడ్డికి మార్చాలి



అన్ని డివిజన్ కార్యాలయాలు జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి మారిస్తే ప్రజలందరికీ సౌలభ్యంగా ఉంటుంది. జోగిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. పలుమార్లు నాయకులకు అధికారులకు చెప్పిన ప్రయోజనం లేకపోయింది.

– ఎరుకలి యాదగిరి, కాసాల

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన మెదక్ జట్టు

చాంపియన్‌గా హన్మకొండ, రన్నరప్‌గా మెదక్

తూప్రాన్: పట్టణ సమీపంలోని రాష్ట్ర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. మూడవ రోజు క్వార్టర్ ఫైనల్‌లో మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, రంగారెడ్డి, హన్మకొండ, నల్గొండ, మహబూబూగర్, భూపాలపల్లి జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ఫైనల్‌లో మెదక్- హన్మకొండ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో హన్మకొండ జట్టు మెదక్ జట్టుపై 6-5 తేడాతో విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణగుప్త అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి తూప్రాన్ సీఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాసాల నవీన్‌కుమార్, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, కోశాధికారి రేణుక, జాయింట్ సెక్రటరీ రాజేందర్, నాగిరెడ్డి, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కోచ్, మేనేజర్‌లు పాల్గొన్నారు.

కోటి హనుమాన్ చాలీసా పారాయణం



గజ్వేల్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

గజ్వేల్‌రూరల్: లోక కల్యాణార్థం కోటి హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని కోలా అభిరాం గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ధర్మరక్షణ, గోరక్షణ, స్త్రీ రక్షణ, సనాతన ధర్మ రక్షణ, దేవాలయ సంరక్షణ, దేశ రక్షణకు తిరుమల తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో జనవరి 21న పారాయణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొనున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి ధర్మ ప్రచార రథాల ద్వారా దక్షిణ భారతదేశంలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటిస్తూ కోటి హనుమాన్ చాలీసా పారాయణంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా హనుమాన్ దీక్ష అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గజ్వేల్‌లో శ్రీనివాస కల్యాణం జరుపుతున్నట్లు చెప్పారు.

వైమానిక వ్యవస్థపై అవగాహన



హకీంపేట్ ఎయిర్ ఫోర్స్‌లో ఎన్‌సీసీ కేడెట్లు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న ఎస్‌ఎన్‌ఐసీ శిక్షణలో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ కేడెట్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా చివరి పర్యటనలో శనివారం హకీంపేట ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ జెట్ ఎయిర్‌క్రాఫ్ట్, హెచ్‌ఏఐ కిరణ్ మాక్ 1, మాక్ 2, చేతక్ హెలికాప్టర్ పనితీరును తెలుసుకున్నారు. ఏటీసీ సెంటర్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను వైమానిక దళ కేడెట్లు వివరించారని క్యాంపు పర్యటన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి తెలిపారు. ఇక 17 డైరెక్టరేట్‌ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో, ఢిల్లీ ద్వితీయ స్థానంలో, రాజస్తాన్ తృతీయ స్థానంలో, గ్రూప్ సాంగ్ విభాగంలో మహారాష్ట్ర డైరెక్టరేట్ మొదటి స్థానంలో, కేరళ ద్వితీయ స్థానంలో, కర్ణాటక తృతీయ స్థానంలో నిలిచినట్లు క్యాంప్ ఎన్‌సీసీ ఆఫీసర్లు లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, లెఫ్టినెంట్ డాక్టర్ మనోజ్ తెలిపారు. విజేతలకు క్యాంపు కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం ట్రోఫీలు అందజేశారు. ఎన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరంలో ఆల్ఫా, బ్రావో, చార్లీ, డెల్టా కంపెనీలుగా విభజించి నిర్వహించిన ఖోఖో పోటీల్లో బ్రావో కంపెనీ, వాలీబాల్ ఆటలో చార్లీ కంపెనీ గెలుపొందగా వారికి క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు బహుమతులను అందజేశారు. అలాగే సాంస్కృతిక పోటీల్లో ఉత్తమ కేడెట్లకు బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ పీఎస్ నందా బహుమతులను ప్రదానం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన బతుకమ్మ సంబురాల్లో ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



చౌడాపూర్ నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్, వీరాపూర్, విఠలాపూర్, ఈర్లవాగు తండాలో ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తే.. కాంగ్రెస్ నిరుపేదల సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. నియంతపాలనకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు గౌరవ భృతి, రైతుబంధు పెంపు వంటి అద్భుతమైన పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్, కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు ఉమాపతిరెడ్డి, రాము పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించాలి

ఓయూ ఓఎస్‌డీ వీసీ రెడ్యానాయక్

మొయినాబాద్: విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్‌డీ వైస్ చాన్సలర్ బి.రెడ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంబీఏలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. పట్టభద్రులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృత్, ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో బతుకమ్మ వేడుకలు



కోలాటం ఆడుతున్న సీపీ శ్వేత, మహిళా అధికారులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీపీ శ్వేత, కలెక్టర్ సతీమణి జ్యోతి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, మహిళా పోలీస్ అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, రామచంద్రారావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, రవీందర్, రాజు, సీఐలు కృష్ణారెడ్డి, భానుప్రకాష్, రవికుమార్, చేరాలు, కమిషనరేట్ ఏఓ యాదమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌ఐలు అపూర్వ, పుష్ప, మహిళా ఏఎస్‌ఐలు సువర్ణ, పరమేశ్వరి, హెడ్ కానిస్టేబుల్స్ స్వాతి, భాగ్య, మహిళా కానిస్టేబుల్స్, కమిషనరేట్ మహిళా సిబ్బంది, షీటీం, భరోసా, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మతో సీపీ శ్వేత, పక్కన కలెక్టర్ సతీమణి జ్యోతి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

అక్రమ మద్యం పట్టివేత

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బెజుగామ, శేరుపల్లి, పిడిచెడ్ గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈసందర్భంగా 30 లీటర్ల వివిధ రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో కొందరు అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు తనిఖీలు చేశారు. లగిశెట్టి సుధాకర్ ఇంట్లో అక్రమంగా 46 లీటర్ల మద్యం పట్టుకున్నామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఈమేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇమాంబాద్ గ్రామానికి చెందిన రెడ్డమైన మల్లేశం (44) పట్టణంలోని సుభాష్‌నగర్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే హోటల్ మూసివేసి శనివారం రాత్రి పట్టణం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇమాంబాద్ బైపాస్ రహదారిలో బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మల్లేశం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాత్‌రూమ్‌లో పడి వ్యక్తి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి బాత్‌రూమ్‌లో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొంపల్లి దుర్గేష్(32)కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం దుర్గేష్ బాత్‌రూమ్‌కు వెళ్లి ఎంతకు బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఆయన కిందపడి ఉండడాన్ని గమనించి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా దుర్గేష్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలి

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలంలోని ప్రగతి ధర్మారం, సుతారిపల్లి, శివ్వాయపల్లి, రామాయంపేట తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి రామాయంపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి మెజార్టీ గల్లంతయ్యేలా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కాలంలో అభివృద్ధి గురించి పట్టించుకోని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని ప్రకటించడం గమనార్హమని విమర్శించారు. అంతకుముందు రామాయంపేట తండాలోని గుడిలో పూజలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు సుప్రభాతరావు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రోహిత్

వైభవంగా పూల పండుగ

ప్రకృతిని ఆరాధించే పూల పండుగ వైభవంగా కొనసాగుతోంది. గునుగు, తంగేడు పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు.. వీటిని ఆలయాలు, కూడళ్ల వద్ద పెట్టి సందడిగా ఆడిపాడుతున్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని తెలిపారు.

– అనంతగిరి



బతుకమ్మతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

యోగాసన శిక్షకుల ట్రైనింగ్‌లో టాపర్‌గా శ్రీదేవి'

చేగుంట(తూప్రాన్): ప్రపంచ స్థాయి యోగాసన శిక్షణ పరీక్షలో చేగుంటకు చెందిన శ్రీదేవి ప్రపంచ టాపర్‌గా నిలిచినట్లు యోగా కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు యోగాసన శిక్షకుల ట్రైనింగ్ కోసం భారత్, జాంబియా, ఉగాండా, బంగ్లాదేశ్, టాంజనియా, స్పెయిన్, వియత్నాం, బెల్జియం, అమెరికా, నేపాల్ నుంచి 109 మందిని ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 98 శాతం ఏ-ప్లస్ కేటగిరి మార్కులతో ప్రపంచస్థాయి మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. గతంలో శ్రీదేవి సీనియర్ విభాగం యోగా పోటీల్లో జాతీయ స్థాయిలో ఆరు బంగారు పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై యోగాసన అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భుజగేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యం, జాయింట్ సెక్రెటరీ నవాతు సురేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నర్సింలు హర్షం వ్యక్తం చేశారు.



చెరువులోపడి వృద్ధురాలి ఆత్మహత్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది చెరువులోపడి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యాదమ్మ(65) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగడంతో మనసస్తాపం చెందింది. దీంతో శనివారం ఆమె గ్రామ సమీపంలోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ శివానందం తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.



యాదమ్మ మృతదేహం